క్లుప్తంగా

నేడు స్పీకర్ పర్యటన

సరుబుజ్జిలి: మండల కేంద్రంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. సరుబుజ్జిలి నుంచి బొర్రంపేట వరకు గల ఆర్అండ్బీ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



పోలీస్తో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

నరసన్నపేట: స్థానిక పోలీస్ స్టేషన్ను ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా గురువారం సందర్శించారు. పోలీస్స్టేషన్లో గదులు, కేసులు నమోదు, రికార్డుల నిర్వహణ, తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు, ఫిర్యాదుల స్వీకరణపై ఆరా తీశారు.

ఏఓకి సత్కారం



రమణమూర్తిని సత్కరిస్తున్న వైద్యులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా ఉద్యోగోన్నతిపై బాధ్యతలు స్వీకరించిన ఏపీవీ రమణమూర్తిని వైద్యులు గురువారం సత్కరించారు. వంద పడకల ఆస్పత్రికి ఇటీవల ఏఓ పోస్టును ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటిసారి ఏఓగా చేరిన రమణమూర్తితో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ, వైద్యులు శ్రీనుబాబు, చంద్రమౌళి, రమేష్, ప్రతిభా చైతన్య, రవికిరణ్, స్ఫూర్తి, బయో మెడికల్ ఇంజినీర్ అవినాష్ పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నరసన్నపేట: స్థానిక కోవెల వీధిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకరరావు, బి.మోహన్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజయనగరం స్వామి కంటి ఆస్పత్రి సిబ్బంది వచ్చి కంటి తనిఖీలు నిర్వహిస్తారని, విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


షూటింగ్లో బంగారు పతకం



చౌదరి లోక్జిత్

ఆమదాలవలస: ఆగ్రాలో ఇటీవల జరిగిన 10వ అంతర్జాతీయ షూటింగ్ చాంపియన్షిప్లో ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేటకు చెందిన చౌదరి వి.ఎస్.లోక్జిత్ బంగారు పతకం సాధించాడు. అక్టోబర్ 26 నుంచి 31 వరకు ఆగ్రాలో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ శ్రేణిలో నిలిచాడని తల్లిదండ్రులు రవికుమార్, సహజ తెలిపారు. విద్యార్థి విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థికి పలువురు ప్రముఖులు, కుటుంబసభ్యులు అభినందనలు తెలిపారు.

బీమా అందజేత



చెక్కు అందజేస్తున్న ఎస్బీఐ సిబ్బంది

కొత్తూరు: మండలంలోని పొనుటూరు గ్రామానికి చెందిన పాత్రో రామచంద్రరావు (ఎస్బీఐ ఖాతాదారుడు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నివగాం ఎస్బీఐ శాఖలో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం నమోదు చేసుకున్నారు. మృతిని భార్య పాత్రో పద్మ నామినీగా ఉన్నారు. ఆమెకు రూ.2లక్షల చెక్కును ఎస్బీఐ సిబ్బంది గురువారం అందజేశారు.

ఆధ్యాత్మికతతో ఆనందం

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక ప్రపంచంలో ఆనందం పొందవచ్చని జిల్లా అదనపు ఎస్పీ పాండు రంగ విఠలేశ్వరరావు అన్నారు. నగరంలోని విశాఖ–బీ కాలనీలో షిరిడీసాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బాబా 756వ సామూహిక సప్తాహ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మధు విలేకరి మాట్లాడుతూ 14 ఏళ్లుగా సప్తాహ పారాయణలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం సాయి సప్తాహ వేడుకల్లో షిరిడి సాయి, శిష్యులు, భక్తులు వేషధారణలు వేసిన వారిని సత్కరించారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



ఆమదాలవలస రూరల్: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

ఆమదాలవలస రూరల్:

పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో బొబ్బిలిపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి, లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సాంకేతికపరమైన కారణాలతో అర్హులైన లబ్ధిదారులు సంక్షేమానికి దూరం కాకుండా చూడాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరువ చేయడానికి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఉందనే విశ్వాసాన్ని ప్రజల్లో నిరంతరం పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వ పథకాలు అందించడంతో ప్రజల్లో వైఎస్సార్సీపీకి మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం వైఎస్సార్సీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గురుగుబెల్లి చంద్రయ్య, మెట్ట వసంతరావు, గురుగుబెల్లి చలపతిరావు, గురుగుబెల్లి నీలారావు, గొంటి కృష్ణ, పేడాడ రమణ, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఈఓపీఆర్డీ డి.గోవిందరావు, ఏఓ మెట్ట మోహన్రావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఏపీఓ పి.లక్ష్మీనరసమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..

నరసన్నపేట: అర్హతే ప్రామాణికం సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కోమర్తి సచివాలయం పరిధిలోని దేవాది గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో టీడీపీ కార్యకర్తలకు, పసుపు జెండా మోసిన వారికే పథకాలు అందేవన్నారు. అదే నేటి వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆధ్వర్యంలో అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చుతున్నారన్నారు. ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో ప్రయోజనం కలిగిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక నిధులు కేటాయిస్తూ ప్రజలకు మేలు చేస్తున్నట్లు వివరించారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపీని ఆదరించాలని కోరారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, దేవాది సర్పంచ్ మంతిన రాము, పార్టీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బార్ల వేణుగో పాలరావు, ముద్దాడ బాలభూపాలనాయుడు, సురంగి నర్సింగరావు, లుకలాపు రవి, దేవాదికి చెందిన పార్టీ నాయకులు ధర్మాన బాబూరావు, గోవిందరావు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దీర్ఘాశిలో..

పోలాకి మండలం దీర్ఘాశి గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు గురువారం తెలిపారు. ఉదయం ఏడు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.



సంక్షేమ పథకాల బుక్లెట్ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

కొత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద ప్రజల ఆరోగ్యానికి భరోసాగా ఉంటుందని మెట్టూరు బిట్–3 ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ కోవిలాపు శ్రీనివాసరావు అన్నారు. మెట్టూరు బిట్–3లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిపుణులైన డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. 421 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడుగురికి మెరుగైన వైద్యం కోసం సిఫార్స్ చేశామని మెట్టూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలపై అవగాహన

పాతపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, మహిళలు బ్యాంకు సేవలపై అవగాహన పెంచుకోవాలని పాతపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్ కె.అక్కయ్యరాజు అన్నారు. మండలంలోని పెద్దలోడిగి, బోరుభద్ర, కొరసవాడ తదితర గ్రామాల్లో డీసీసీబీ సేవలపై అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో డిపాజిట్లు, బంగారం అభరణాలపై తక్కువ వడ్డీకే రుణాలు, రైతులకు పంట భూములపై రుణాలు, మహిళా స్వయంశక్తి సంఘాలకు పొదుపుపై అవగాహన కల్పించారు. ఆన్లైన్ బ్యాంకింగ్పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. బ్యాంకు ఏఎం ఎం.రమ్య, సూపర్వైజర్ ఎస్.ఫల్గుణరావు, సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి, వైఎస్సార్సీపీ నాయకుడు శ్రీనివాసరావు, పాపారావు, రామారావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ అక్కయ్యరాజు

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

బూర్జ: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు ఆధ్వర్యంలో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం భోజన పథకం వంట ఏజెన్సీలకు ప్రభుత్వం సమకూర్చిన వంట పాత్రలను అందజేశారు. వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఏంఈఓలు ఎన్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు, ఎమ్మార్సీ సిబ్బంది, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, స్థానిక సర్పంచ్ ఏగు అనురాధ, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



వంట పాత్రలను అందజేస్తున్న అధికారులు, నాయకులు

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం

ఆమదాలవలస రూరల్: విద్యుత్ ప్రమాదలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్శాఖ ఏడీఏ జి.భాస్కరరావు అన్నారు. మండలంలోని కొత్త రోడ్ జంక్షన్, గోపీనగర్, తోటాడ, అక్కివరం గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణాలు చేపట్టే సమయంలో విద్యుత్ తీగల వద్ద కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్ తీగలు ఉన్న సమయంలో సంబంధిత సిబ్బందికి సమాచారం అందజేస్తే విద్యుత్ నిలుపుదల చేస్తారన్నారు. విద్యుత్ పరికరాలను రక్షణ లేకుండా తాకరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఎల్ఐ కె.శ్రీనివాసరావు, లైన్మన్ టి.కృష్ణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: విద్యుత్తో అతి జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ అవసరం ఎంత ఉందో, ప్రమాదం కూడా అంతే ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రమణమూర్తి అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో విద్యుత్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు తప్పనిసరి అని అన్నారు. విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



మెళియాపుట్టి: విద్యుత్ భద్రతా చర్యలపై ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆమదాలవలస: మండలంలోని రామచంద్రపురం గ్రామం సమీపంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.కృష్ణ గురువారం తెలిపారు. వంశధార నదీ తీరం చెవ్వాకులపేట వద్ద నుంచి ఆమదాలవలస వైపు ఇసుకను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. మండలంలోని పొన్నాంపేట గ్రామానికి చెందిన పొన్నాన అప్పలనాయుడు, సైలాడ గ్రామానికి చెందిన పొన్నాడ అప్పలసూరి, చిట్టివలస గ్రామానికి చెందిన సీర సంజీవరావుకు చెందిన ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అపరాల సాగుకు సమయమిదే..

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ వరి తరువాత ఆరుతడిగా పండించే అపరాల పంటలకు విత్తనాలు వేసుకునే సమయమిదేనని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ అన్నారు. గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో గురువారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు. రైతులకు అపరాల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. అపరాల పంటలైన పెసర, మినుము పండించే రైతులు సకాలంలో విత్తనాలు వేసుకోవటం ఎంతో మంచిదన్నారు. విత్తనశుద్ధి చేసిన తరువాత విత్తనాలు వేసుకుంటే అనేక తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. మొక్కజొన్న పండించే రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 42 మంది ఎంపిక

నరసన్నపేట: స్థానిక చిత్తిరి వీధిలోని సత్యసాయి పెద్ద మందిరంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 42 మందికి కంటి శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి మందిర కమిటీ సహకారంతో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీంట్లో 110 మందికి తనిఖీలు చేపట్టారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బందితో పాటు సత్యసాయి మందిర కమిటీ ప్రతినిధులు నాగేశ్వరరావు, కేఎల్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

సరుబుజ్జిలి: మండలంలోని సింధువాడ పంచాయతీ పరిధిలోని జనపాల రమణమ్మ శ్రీకాకుళం పట్టణంలోని మెడికవర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. గ్రామ వలంటీర్ రామరాజు గురువారం ఆస్పత్రికి వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.



పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ రామరాజు

సీఎం జగన్ను కలిసిన ప్రజాప్రతినిధులు



నరసన్నపేట: సీఎం జగన్ను కలిసిన ఎంపీపీ మురళి, పొందర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అప్పన్న



పోలాకి: సీఎం జగన్మోహన్రెడ్డితో కరచాలనం చేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, చిత్రంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి/నరసన్నపేట: విశాఖపట్నంలో గురువారం జరిగిన బీసీబీడీ సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కలిశారు. ఎమ్మెల్యే కుమారుడు, వైఎస్సార్సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పొందర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజాపు అప్పన్న తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ

పొందూరు: సత్యసాయి జిల్లాలో అక్టోబర్ 28 నుంచి 30 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14, 17, 19 జూడో పోటీల్లో తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గొల్లపల్లి నీలిమకు రజత పతకం, కొత్తకోట నితిన్, కూన విశరామరాజులకు కాంస్య పతకాలు సాధించారని హెచ్ఎం బల్ల కంటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ధవల పెంటయ్య తెలిపారు. విద్యార్థులను రాష్ట్ర జూడో సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి పైడి సునీత, పాఠశాల కమిటీ చైర్మన్ ప్రసాదరావు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాధ్యతగా పని చేయండి

- ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

నరసన్నపేట: అంగన్వాడీ కేంద్రాలను సమయానికి తెలరవాలని, లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న పోషక ఆహారాన్ని సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. విధిగా సమయ పాలన పాటించాలన్నారు. పోషకాహారం పంపిణీకి అమలు చేస్తున్న యాప్ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పీఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ శాంతిశ్రీ

నాలా వసూలుపై దృష్టి సారించాలి

ఎల్.ఎన్.పేట: నాలా వసూళ్లపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ ఆర్.అప్పలరాజు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించే వారి వద్ద నుంచి నాలా వసూలు చేయాలన్నారు. నాలా వసూలు విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమగ్ర భూ రీసర్వే కోసం రెవెన్యూ గ్రామాల వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి సర్వే పూర్తిచేయాలన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు



చింతలపేటలో తాగునీటి కుళాయిలకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించడమే వైఎస్సార్సీపీ ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని చింతలపేట, దండేంవలస, బొబ్బిలిపేట గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మించనున్న తాగునీటి కుళాయి కార్యక్రమానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో తాగునీటి కుళాయిల నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదిక జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్సీపీ నాయకులు పేడాడ రమణ, గురుగుబెల్లి చంద్రయ్య, మెట్ట వసంతరావు, చలపతిరావు, గురుగుబెల్లి ప్రభాకరరావు, సీపాన గోవిందరావు, ఆర్డబ్ల్యూఎస్ జేఈ ఎం.చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్సీసీలో చేరిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులు

- కళాశాల చరిత్రలో తొలిసారిగా 48 మంది చేరిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు మరో చరిత్రను లిఖించారు. 72 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కళాశాలలో మొదటసారిగా నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్సీసీ)లో విద్యార్థినులు ప్రవేశాలు పొందారు. 14వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలో ఉన్న తమ కళాశాలలో చదువుతున్న బాలికలు దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలనే పట్టుదలతో ఉన్నారని పేర్కొంటూ.. ఎన్సీసీ సీనియర్ వింగ్ ప్రవేశాలకు అవకాశం కల్పించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ చేసిన విజ్ఞప్తి మేరకు ఇటీవల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ బెనర్జీ అధికారికంగా అనుమతులు మంజూరు చేశారు.

పూర్తయిన ఎంపికల ప్రక్రియ..

ఎన్సీసీ సీనియర్ వింగ్లో ప్రవేశాలకు గురువారం కళాశాల మైదానంలో బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో ప్రావీణ్యతా పరీక్షలు జరిపారు. ప్రతిభ ఆధారంగా 48 మందిని ఎంపికచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, సీనియర్ వింగ్ సుబేదార్లు బి.ఎస్.రావు, రవికుమార్, కేర్ టేకర్లు ఎస్.పావని(కామర్స్), వరలక్ష్మి(హిస్టరీ), ఎన్సీసీ అధికారి డాక్టర్ వై.పోలినాయుడు పాల్గొన్నారు.



ఎంపికైనవారికి సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, తదితరులు